

ప్రజల మేలు కోసమే జగనన్న సురక్ష

పెనుగొండ:ప్రతి కుటుంబానికీ మేలు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. శుక్రవారం పెనుగొండ శివారు చెరుకువాడ గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష ప్రత్యేక క్యాంపులో జిల్లా కలెక్టరు పాల్గొన్నారు. ఇప్పటివరకూ మంజూరు చేసిన వివిధ రకాల ధ్రువపత్రాలు,రిజిస్టర్లను ఆమె పరిశీలించారు. ఎక్కువగా కుల, ఆదాయ ధ్రువపత్రాలను మాత్రమే ఇస్తున్నారని, మిగతా ధ్రువపత్రాలకు ఎందుకు దరఖాస్తులు రాలేదని కలెక్టరు ఆరా తీశారు. ధ్రువపత్రాలపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలన్నారు. శుక్రవారం 175 వివిధ రకాల ధ్రువ పత్రాలను ప్రజలకు అందజేశామని కలెక్టరుకు తహశీల్దారు వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు కోరిన ధ్రువపత్రాలు, అర్హత ఉండి పథకం పొందని వారిపై ప్రధానంగా దృష్టి పెట్టాలన్నారు. శాఖల మధ్య సమన్వయం ఉన్నప్పుడే ప్రభుత్వం ఏ కార్యక్రమం తలపెట్టినా మంచి ఫలితాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి, జిల్లా నీటిపారుదల శాఖ అధికారి ఎస్‌వి.రావు, తహశీల్దార్ ఎన్.గరుమూర్తి రెడ్డి పాల్గొన్నారు.

రహదారు(ణా)లు..!

గ్రామాల్లో ఆర్అండ్‌బి రోడ్లన్నీ అస్తవ్యస్తం
వేసవిలో ఇష్టానుసారంగా మట్టి తోలకాలతో పరిస్థితి అధ్వానం
బువ్వనపల్లి, అడవికొలను, నిడమర్రు రోడ్డు చూస్తే వణుకే
వర్షం పడితే మోటార్ బైక్ వెళ్లలేని దుస్థితి
ప్రతిపక్షంలో ఇదే రోడ్డు గురించి పాదయాత్ర చేసిన ఎంఎల్ఎ వాసుబాబు
నాలుగేళ్లయినా పట్టని వైనం
ప్రమాదకరంగా బుట్టాయగూడెం - జంగారెడ్డిగూడెం రోడ్డు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లాలో ఆర్అండ్‌బి రహదారులు అత్యంత దారుణంగా తయారయ్యాయి. గ్రామాలకు వెళ్లే రోడ్ల పరిస్థితి అత్యంత దారుణం మారింది. అడుగుకో గొయ్యితో ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ తరుణంలో వేసవిలో చేపట్టిన మట్టితోలకాలతో మరింత అధ్వానంగా తయారయ్యాయి. దీంతో వర్షం వస్తే చాలు జనం రోడ్డుపై వెళ్లాలంటేనే వణికిపోతున్నారు. వైసిపి ప్రభుత్వం వచ్చి నాలుగేళ్లయినా రోడ్ల గురించి పట్టించుకునే పరిస్థితి లేదు. దీంతో జనం నిత్యం నరకం అనుభవిస్తున్నారు. జగనన్న లే అవుట్ల పూడిక పేరుతో వేసవిలో ఇష్టానుసారంగా వైసిపి నాయకులు గ్రామాల్లో మట్టి తవ్వకాలు సాగించారు. వైసిపి నాయకులు అనుమతుల్లేకుండా ఇష్టానుసారంగా మట్టి తవ్వకాలు సాగించినా అడిగే నాథుడే లేకుండా పోయాడు. మట్టి తోలకాలతో రోడ్ల నిండ మట్టి చేరిపోయింది. వర్షం పడితే ఆ రోడ్లన్ని జారుడుబల్లల్లా తయారయ్యాయి. ఆర్అండ్‌బి రోడ్లా..మట్టి రోడ్లా అన్నట్లు పరిస్థితి తయారైంది. ఉంగుటూరు నియోజకవర్గంలో బువ్వనపల్లి నుంచి అడవికొలను, నిడమర్రు వెళ్లే రోడ్డు అందుకు ప్రత్యక్ష నిదర్శనంగా చెప్పొచ్చు. వర్షం పడితే ఈ రోడ్డుపై ద్విచక్రం వాహనం వెళ్లలేని విధంగా తయారయ్యాయి. వర్షం పడినప్పుడు మోటార్ బైక్‌పై వెళుతూ జారిపడిపోతున్న ఘటనలు కోకొల్లలు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు 2019కు ముందు ఇదే రోడ్డు గురించి ప్రస్తుత ఉంగుటూరు ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు, ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ పాదయాత్ర చేశారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే బువ్వనపల్లి, అడవికొలను రోడ్డు వేస్తామంటూ గ్రామస్తులకు హామీ సైతం ఇచ్చారు. వైసిపి అధికారంలోకొచ్చి నాలుగేళ్లు దాటినా ఇప్పటికీ ఈ రోడ్డుమాత్రం బాగుపడలేదు. అడవికొలను గ్రామానికి బంధువులు ఎవరైనా రావాలంటే రోడ్డు చూసి భయపడుతున్నారు. వర్షం పడినప్పుడు మట్టి రోడ్డుకంటే దారుణంగా ఉంటున్నాయి. నాయకులు మారినా రోడ్డు పరిస్థితి మారకపోవడంతో అడవికొలను గ్రామానికి చెందిన ప్రజలకు ఏం చేయాలో దిక్కుతోచడం లేదు. తమగోడు ఎవరికి చెప్పుకోవాలో తెలీక తలలుపట్టుకుంటున్నారు. పశ్చిమగోదావరి జిల్లా ఇరగవరం మండలం కాకిలేరు గ్రామానికి వెళ్లే రోడ్డు సైతం మట్టి తవ్వకాలతో వర్షాలకు జారుడు బల్లలా తయారైంది. దీంతో రైతులు, ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇవే కాదు.. వేసవిలో ఇష్టానుసారంగా సాగించిన మట్టితవ్వకాలతో గ్రామాల్లోని ఆర్అండ్‌బి రోడ్లన్నీ ఛిద్రమయ్యాయి. ఏ ఒక్క అధికారిగానీ, ప్రజాప్రతినిధిగానీ రోడ్లగురించి నోరుమెదపడం లేదు. మండల కేంద్రం బుట్టాయగూడెం నుంచి జంగారెడ్డిగూడేనికి వచ్చే రోడ్డుపై గోతులు చూస్తే నోరెళ్ల బెట్టాల్సిందే. ప్రధాన రహదారి సైతం అత్యంత దారుణంగా ఉంది. ఇక ఏజెన్సీ గ్రామాల్లోని రోడ్లన్నీ అత్యంత దారుణంగా తయారవడంతో జనం నరక యాతన అనుభవిస్తున్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రోడ్ల గురించి ఆందోళనలు, పాదయాత్రలు చేసిన వైసిపి నాయకులు అధికారంలోకొచ్చాక పట్టించుకోవడం లేదు. దీంతో ప్రజాప్రతినిధులపై జనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



అధ్వానంగా ఉన్న బువ్వనపల్లి, అడవికొలను ఆర్అండ్‌బి రోడ్డు

పశు కిసాన్ కార్డులు అందజేతకు చర్యలు

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

పాడి రైతులకు పశుకిసాన్ కార్డులు అందజేయడానికి వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ ప్రశాంతి, డిఆర్‌డిఎ, పశుసంవర్ధక శాఖ, బ్యాంకు అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చేయూత లబ్ధిదారుల వద్ద ఎన్ని పశువులు ఉన్నాయి, వారిలో ఎంతమంది అమూల్‌కు పాలు పోస్తున్నారనేది తనిఖీ చేయాలన్నారు. కొత్త పాడి పశువులను కొనుగోలు చేయడానికి వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. నరసాపురం, యలమంచిలి, తాడేపల్లిగూడెంలో అమూల్ కేంద్రాలకు పాలు పోసి రైతులకు వర్కింగ్ క్యాపిటల్ అందజేయడానికి, కొత్తగా పశువుల కొనుగోలు చేసే రైతులకు డిసిసిబి ద్వారా కొత్త రుణాలు అందజేయడానికి వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో తాడేపల్లిగూడెంలో 10, యలమంచిలి, నరసాపురం, పాలకొల్లులో 7 చొప్పున మొత్తం 31 అమూల్ కేంద్రాలు పనిచేస్తున్నాయని తెలిపారు. ప్రస్తుతం 940 మంది పాడి రైతులు రోజుకు 3,112 లీటర్ల పాలను అందజేస్తున్నట్లు తెలిపారు. చేయూత పథకం పొందిన ప్రతి పాడి రైతూ అమూల్ కేంద్రానికే పాలను ఖచ్చితంగా అందజేసేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్‌డిఎ పీడీ ఎన్ఎస్ఎస్ వేణుగోపాల్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి మురళీకృష్ణ, డిసిఒ రవికుమార్, డిఆర్‌డిఎ ఎపిఎమ్స్, పశుసంవర్ధక శాఖ డిడిలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి



డివైఇఒకు వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నేతలు

ప్రయివేటు ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - తణుకురూరల్

ప్రయివేటు విద్యా సంస్థల్లో పనిచేస్తున్న టీచర్స్, లెక్చరర్స్, సిబ్బంది సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక డివైఇఒ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం డివైఇఒ సిసి సీత సుబ్రహ్మణ్యేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. కార్పొరేట్, ప్రయివేటు విద్యా సంస్థల్లో పనిచేస్తున్న వారి సమస్యలు పరిష్కరించాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు, పిఎఫ్, ఇఎస్ఐ ఇవ్వాలని, ఉద్యోగభద్రత కల్పించాలని, చట్టప్రకారం వ్యవహరించని యాజమాన్యాలపై చర్యలు చేపట్టాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ కార్పొరేట్, ప్రయివేటు విద్యాసంస్థల యాజమాన్యాలు పిల్లల ఫీజులు, కనీసవేతనాల విషయంలో చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తున్నప్పటికీ ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. ప్రయివేటు విద్యాసంస్థల్లో పనిచేస్తున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో వారి హక్కులు కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందన్నారు. పిఎఫ్, ఇఎస్ఐ కనీస వేతనాలు అమలు చేయని వారిపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వారి సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకూ సిఐటియు ఆందోళన చేస్తుందని ప్రతాప్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణాధ్యక్షులు ఎన్.ఆదినారాయణ బాబు, గార రంగారావు, శ్రీను, గంగాధర్, నాగరాజు, మందులయ్య, దుర్గ ప్రసాద్ పాల్గొన్నారు.



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

ఖాళీ బిందెలతో మహిళల నిరసన

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

ఐదు గ్రామాల్లోని 30 వేల జనాభాకు తాగునీరందించే తూర్పుతాళ్లు రక్షిత మంచినీటి పథకం చెరువు పూర్తిగా ఎండిపోవడం సిగ్గుచేటని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కవురు పెద్దిరాజు విమర్శించారు. శుక్రవారం వేములదీవి వెస్ట్ గ్రామ సచివాలయం వద్ద స్థానిక మహిళలు ఖాళీ బిందెలతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దిరాజు మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యం వల్లే తూర్పుతాళ్లు కుళాయి చెరువు ఎండిపోయిందన్నారు. కాలువ నీటిని చెరువులో నింపకుండా యథేచ్ఛగా కుళాయిలకు సరఫరా చేయడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. ప్రజల ఆరోగ్యంపై అలసత్వం తగదని హితవు పలికారు. గొందిమూల ఏరియాలో పైపులైన్లు సక్రమంగా లేకపోవడం వల్ల నెల రోజులుగా నీరందడం లేదన్నారు. తీర ప్రాంత ప్రజల దాహార్తిని తీర్చడానికి తక్షణం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కవురు కొండాలమ్మ, పూదిండి అంజమ్మ, బొక్కా సుశీల, ముచ్చు అంజమ్మ, మామిడిశెట్టి పద్మ, తుమ్మా మహాలక్ష్మి పాల్గొన్నారు.

అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలి

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం


అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడంతోపాటు, మరణించిన వారి ఓట్లు తొలగింపు ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్ రెడ్డి సంయుక్తంగా ఎలక్షన్స్, రీసర్వే, జగనన్న సురక్ష, గృహ నిర్మాణం అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ కొత్త ఓటర్ల నమోదు ఎంత ముఖ్యమో, మరణించిన వారి ఓట్ల తొలగింపు కూడా అంతే ముఖ్యమన్నారు. ట్రాన్స్ జెండర్స్, హోంలెస్ పీపుల్, సెట్లర్స్ ఓట్లు నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. 18 సంవత్సరాలు నిండి కొత్తగా ఓటు నమోదు చేసుకున్న వారికి మాత్రమే ఫారం - 6 వినియోగించాలని, మిగిలిన వారికి ఫారం-8లో ఓటు నమోదుకు స్వీకరించాలని తెలిపారు. ఒకే ఇంటి నంబర్‌పై ఎక్కువ ఓట్లు నమోదు అయితే నోటీసు జారీ చేసి, తప్పుగా నమోదైన వాటిని వెంటనే తొలగించాలన్నారు. రీసర్వేకు సంబంధించి ఇప్పటివరకూ 90 ఒఆర్ఐ లను పూర్తి చేయడం జరిగిందని, మిగిలిన గ్రామాలకు కూడా ఈ నెలాఖరులో పూర్తి చేయాలని తహశీల్దార్లు, సర్వే సిబ్బంది పూర్తిస్థాయిలో ప్రణాళికలు తయారు చేసుకొని అందుకు అనుగుణంగా పనులు పూర్తి చేయాలన్నారు. జగనన్న లేఔట్ల కోర్టు కేసులను త్వరితగతిన పరిష్కరించడానికి కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి, సబ్‌కలెక్టర్ ఎం.సూర్యతేజ, ఆర్‌డిఒ దాసి రాజు, అసిస్టెంట్ ట్రెయినీ కలెక్టర్ డి.అఖిల, తహశీల్దార్ పాల్గొన్నారు.

గరగపర్రు బాధితులకు పరిహారం ఇవ్వాలి

ఎస్‌సి జాతీయ కమిషన్ సభ్యురాలిని కోరిన బాలకృష్ణ

ప్రజాశక్తి - పాలకోడేరు

గరగపర్రు సాంఘిక బహిష్కరణ ఘటనలో కేవలం కొద్ది మంది దళితులకు మాత్రమే పరిహారాన్ని అందించారని, మిగిలిన 110 మంది దళితులకు పరిహారం ఇవ్వాలని ఎస్‌సి జాతీయ కమిషన్ సభ్యురాలు అంజుబాలను జిల్లా ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ మోనిటరీ కమిటీ సభ్యులు పొన్నమండ బాలకృష్ణ కోరారు. విజయవాడ హోటల్ గేట్వేలో శుక్రవారం బాలకృష్ణ ఎస్‌సి జాతీయ కమిషన్ సభ్యురాలు అంజుబాలను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులు, అన్యాయం, వివిధ సందర్భాల్లో నమోదైన ఎస్‌సి, ఎస్‌టి, అట్రాసిటీ కేసులు గురించి బాలకృష్ణ వివరించారు. ముఖ్యంగా గరగపర్రు వెలివేత ఘటనలో 110 మందికి పరిహారం, అందించాల్సిన రాయితీలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. అలాగే ఆకివీడు మండలం కుప్పనపూడి గ్రామంలో అనుకోడు పేటకు చెందిన మృతుడు బురగా నాగేశ్వరరావు కుటుంబాన్ని ఆదుకోవడంతోపాటు ఉద్యోగం, రెండెకరాల భూమి, మూడు సెంట్ల స్థలాన్ని అందించాలని కోరారు. ముఖ్యంగా నాగేశ్వరరావు పిల్లలకు పీజీ వరకూ ఉచిత విద్య అందించాలని, అలాగే జిల్లాలోని ఎస్‌సి, ఎస్‌టిలకు రావాల్సిన పరిహారాన్ని అందించాలని కోరారు. అలాగే జాతీయ స్టేట్ కమిషన్ సభ్యులు గడ్డం సునీల్ కుమార్‌ను కూడా కలిసి సమస్యలు విన్నవించానని బాలకృష్ణ తెలిపారు. బాలకృష్ణ వెంట జాతీయ దళిత నాయకులు డాక్టర్ కోరం ముసలయ్య ఉన్నారు.




ఎస్‌సి జాతీయ కమిషన్ సభ్యురాలు అంజుబాలకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బాలకృష్ణ

విద్యుత్ ఛార్జీలు ఉపసంహరించుకోవాలని ధర్నా

ప్రజాశక్తి - నరసాపురంటౌన్

ట్రూ అప్ ఛార్జీలు, సర్దుబాటు ఛార్జీల పేరుతో విద్యుత్ వినియోగదారులపై వేస్తున్న భారాలను ఉపసంహరించుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కవురు పెద్దిరాజు డిమాండ్ చేశారు. దారుణంగా పెంచిన విద్యుత్ ఛార్జీలు, కరెంటు కోతలను నిరసిస్తూ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం తూర్పుతాళ్లు సబ్‌స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దిరాజు మాట్లాడుతూ 2014-19లో వాడిన కరెంట్‌కు ట్రూ అప్ ఛార్జీలు వసూలు చేయడం సిగ్గుచేటన్నారు. ఈ నాలుగేళ్లలో ప్రజలపై 25 వేల కోట్ల రూపాయల భారాన్ని మోపారని విమర్శించారు. స్మార్ట్ మీటర్లు పెట్టాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి బొక్కా శ్రీనివాస్, జల్లి రామ్మోహనరావు, గుత్తుల శ్రీరామ చంద్రుడు, కాకిలేటి ప్రసాద్, కవురు శ్రీనివాస్, గుత్తుల శ్రీరామ్మూర్తి, కవురు సత్యనారాయణ, తుమ్మా సూర్యనారాయణ పాల్గొన్నారు.



సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న సిపిఎం నేతలు

నెలాఖరు రెండో విడత టిడ్కో గృహాల పంపిణీ : ఎంఎల్ఎ

భీమవరం రూరల్:ఈ నెలాఖరు నాటికి రెండో విడత టిడ్కో గహాలను లబ్ధిదారులకు పంపిణీ చేయడానికి ఏర్పాట్లు పూర్తి చేయాలని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం స్థానిక క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ అధికారులతో సమీక్షించారు. అనంతరం ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ మొదటి విడతగా-2 వేల టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందించినట్లు తెలిపారు. మరో రెండు వేల గహాలను ఈ నెలాఖరు నాటికి లబ్ధిదారులకు అందించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. గృహాల్లో నివసిస్తున్న వారికి అన్ని సదుపాయాలూ కల్పించేందుకు చర్యలు తీసుకున్నామని, మిగిలిన వారికి కూడా త్వరితగతిన గృహాలు అప్పగిస్తామని తెలిపారు. రోడ్ల పనుల్లో నాణ్యత లోపిస్తే మాత్రం సహించేది లేదన్నారు. ఈ సమీక్షా సమావేశంలో ఇన్‌ఛార్జి మున్సిపల్ కమిషనర్ సుధాకర్, ఎంఇ.త్రినాధరావు, డిఇలు అప్పలరాజు, విజయ్‌లు పాల్గొన్నారు.

మహిళలపై హింసను అరికట్టాలి

ఐద్వా జిల్లా కార్యదర్శి పూర్ణ

ప్రజాశక్తి - భీమవరం

బాలికలు, మహిళలపై రోజురోజుకూ హింస పెరుగుతోందని, దీన్ని అరికట్టాల్సిన ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దుర్మార్గమని ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ విమర్శించారు. మహిళలపై ఆకాంక్షలు విధించి అణిచివేతకు గురిచేసిన మనువాద సిద్ధాంతాన్ని తిరిగి సమాజం, మహిళలపై బిజెపి రుద్దుతోందని విమర్శించారు. భీమవరం డిఎన్ఆర్ కాలశాలలో ఐద్వా ఆధ్వర్యంలో మహిళలపై హింసను అరికట్టాలని కోరుతూ శుక్రవారం సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్ణ మాట్లాడుతూ ఢిల్లీలో శ్రద్ధ వాకర్, ముంబయిలో సరస్వతీ వైద్యునిపై అతిక్రూరంగా జరిగిన హత్యలు దేశానికి, సమాజానికి అప్రతిష్టగా ఉన్నాయని పేర్కొన్నారు. దేశంలో ఏదో ఒక మూల ప్రతి నిమిషానికీ ఒక అఘాయిత్యం జరుగుతోందన్నారు. అయితే వెలుగులోకి వస్తున్నవి కొన్ని మాత్రమేనని పేర్కొన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన తరువాత ఇవి మరింత పెరిగాయని విమర్శించారు. మహిళల పట్ల తేలిక భావన ఉండడం బాధాకరమన్నారు. మహిళలను రెండో స్థాయి వ్యక్తులుగా, లైంగిక వస్తువులుగా మనువాద బిజెపి భావించడం అన్యాయమన్నారు. మహిళల రక్షణ, హింసపై మహిళల పోరు యాత్ర ప్రారంభమైందని, మహిళలందరూ కలిసికట్టుగా ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.ఉదయ్ కుమారి, భీమవరం పట్టణ అధ్యక్షురాలు ఎం.సరోజినీ, శిరీష, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పొగాకు పూర్ణ

వారాహి యాత్రను విజయవంతం చేయాలి

టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించిన భవిష్యత్తు గ్యారంటీ బస్సు యాత్ర రాష్ట్ర వ్యాప్తంగా దిగ్విజయంగా కొనసాగుతోందని, యాత్రను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి తెలిపారు. శుక్రవారం ఆమె కార్యాలయంలో నిర్వహించిన భీమవరం నియోజకవర్గంలోని పార్టీ అధ్యక్ష కార్యదర్శుల సమావేశంలో ఆమె మాట్లాడారు. త్వరలో భీమవరం నియోజకవర్గానికి రానున్న భవిష్యత్తు గ్యారెంటీ బస్సు యాత్ర ద్వారా ప్రజల్లోకెళ్లి చంద్రబాబు ప్రకటించిన ఆరు పథకాలను విస్తృత ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గ పరిశీలకుడు రాష్ట్ర కార్యదర్శి దాసరి ఆంజనేయులు మాట్లాడుతూ బస్సు యాత్ర ర్యాలీలో ప్రతి కార్యకర్తా, నాయకులూ తన వంతు కర్తవ్యంగా పాల్గొనాలని తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వేండ్ర శ్రీనివాస్ వీరవాసరం మండల అధ్యక్ష కార్యదర్శులు కొల్లేపర శ్రీనివాస్ వీరవల్లి శ్రీనివాస్ ఉపాధ్యాక్షుడు యరకరాజు గోపాలకృష్ణరాజు, భీమవరం మండల అధ్యక్ష కార్యదర్శులు రేవు వెంకన్న కౌరు పృథ్వీశంకర్, ఐటిడిపి అధ్యక్షుడు బొడ్డు మోహన్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తోట సీతారామలక్ష్మి

వేగవంతంగా పొన్నపల్లి ఏటిగట్టు పనులు

రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

రూ.27 కోట్లతో చేపడుతున్న పొన్నపల్లి ఏటిగట్టు నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు తెలిపారు. శుక్రవారం ఏటిగట్టు పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. నాలుగు నెలల క్రితం వరదల సమయంలో ఇబ్బంది లేకుండా యుద్ధ ప్రాతిపదికన రూ.56 లక్షలతో తాత్కాలికంగా పనులు చేపట్టామన్నారు. ప్రస్తుతం శాశ్వత పరిష్కారం కోసం రివిట్మెంట్, గ్రోయింగ్స్‌తో ఏటిగట్టు కోతకు గురికాకుండా మున్సిపాల్టీ పరిధిలో సుమారు 450 మీటర్ల వరకూ నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. దర్భరేవు, నవరసపురం, మాధవాయిపాలెంలో ఉన్న తూములు, లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ఏటిగట్ల పటిష్టతకు సుమారు 8 కోట్ల నిధులు మంజూరు చేసి, టెండర్లు ప్రక్రియ పూర్తి చేశామని తెలిపారు. పొన్నపల్లి ఏటిగట్టు పనులు ఇంతవరకు 30 శాతం పూర్తి చేశారని, వరదలు రాకమునుపే ఆగస్టు 1వ తేదీలోపు పూర్తిస్థాయిలో నిర్మాణం పనులు చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పొన్నపల్లి ఏటిగట్టు ప్రాంతంలో నివాసాలకు సంబంధించి డ్రెయినేజీ వ్యవస్థ గోదావరి నదిలోకి పెట్టారని, ఏటిగట్టు నిర్మాణ పనులు పూర్తయితే డ్రెయినేజీ పారుదలకు ఇబ్బంది వస్తుందని తెలిపారు. వాటిని తొలగించడానికి ప్రత్యామ్నాయ చర్యలకు పురపాలక సంఘం అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. విద్యుత్ సమస్యలు కూడా పూర్తిస్థాయిలో పరిష్కరించాలని ఆయన అన్నారు. పొన్నపల్లి ప్రారంభంలోని శ్మశానవాటిక నుంచి రైతు బజారు చివరి వరకూ ఏటిగట్టు ప్రతిష్టతతో పాటు జరుగుతున్న బిటి రహదారి నిర్మాణం పనులను పరిశీలించారు. ఆయన వెంట మున్సిపల్ ఛైర్ పర్సన్ బర్రె శ్రీవెంకటరమణ, ఎఎంసి ఛైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, బర్రి శంకర్, మల్లాడి బుజ్జి పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న ముదునూరి ప్రసాదరాజు

ఉపాధి హామీ పథకంపై సామాజిక తనిఖీ

ప్రజాశక్తి - ఉండి

ఉపాధి హామీ పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థిక స్వావలంబన చేసుకోవాలని డ్వామా పీడీ ఎం.రాజేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఉండి మండల అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఉపాధి హామీ పథకంపై మండల స్థాయిలో సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేశ్వరరావు మాట్లాడుతూ 2022 - 2023 సంవత్సరానికి గాను 6,06,90,944 రూపాయల పనులను మండలంలో ఉపాధి హామీ ద్వారా చేయడం జరిగిందన్నారు. మండలంలోని 19 గ్రామాలలో జిల్లా రిసోర్స్ పర్సన్లు సోషల్ ఆడిట్ నిర్వహించి గ్రామసభలు పెట్టడం జరిగిందన్నారు. ఆయా గ్రామ సభల్లో ఈ పనులకు సంబంధించి చిన్నచిన్న పొరపాట్లను చూపించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు, వాంద్రం సర్పంచి దాసరి వెంకటకృష్ణ, చెరుకువాడ సర్పంచి కొండవీటి సాంబశివరావు, ఆరేడు సర్పంచి కట్రెడ్డి బ్రహ్మానందం పాల్గొన్నారు.


డ్రైడే కార్యక్రమంలో వైద్యాధికారి లక్ష్మణరావు

వ్యాధులపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ప్రజల భాగస్వామ్యం, అవగాహనతో కీటక జనిత వ్యాధులను అరికట్టవచ్చని తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవి.లక్ష్మణరావు తెలిపారు. డాక్టర్ వైఎస్ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలోని 10, 11, 12, 28 వార్డుల్లో జరుగుతున్న డ్రై డే కార్యక్రమాన్ని ఆయన శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దోమల ద్వారా వచ్చే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. డబ్బాలు, టైర్లు, కొబ్బరి బొండాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. డెంగీ నివారణ మాసోత్సవాల్లో భాగంగా మున్సిపల్ ఉన్నత పాఠశాల, కడకట్ల విద్యార్థులకు డెంగీ వ్యాధి వ్యాప్తిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆరోగ్య కార్యకర్తలు మేరీ, పోసమ్మ, మంగతాయారు, చంద్రకళ, ఆరోగ్య సహాయకులు కాంతారావు, ఆశాలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

చురుగ్గా పూడిక తొలగింపు పనులు

ప్రజాశక్తి - పోడూరు

మండలంలోని జిన్నూరు శివారు నరసింహరావుపేటలోని స్థానికంగా ఉన్న మురుగు డ్రెయిన్‌లో పూడిక తొలగింపు పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ పనులను శుక్రవారం గ్రామ సర్పంచి జమ్ము బేబీ మహాలక్ష్మి పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ వర్షాకాలం రావడంతో గ్రామంలో అన్ని ప్రాంతాల్లో ప్రత్యేకంగా పారిశుధ్య కూలీలను ఏర్పాటు చేసి డ్రెయినేజీల్లో సిల్ట్ తొలగింపు పనులు నిర్వహించామన్నారు. వర్షాకాలంలో వైరల్ జ్వరాలు వ్యాప్తి చెందే ప్రమాదం ఉన్నందున ముందు జాగ్రత్తగా పారిశుధ్య చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. నరసింహరావుపేటలోని ప్రధాన మురుగు డ్రెయినేజీలో చాలా ఏళ్లుగా చెత్త, పూడిక పేరుకుపోయి అధ్వానంగా మారిందన్నారు. స్థానిక ప్రజల విజ్ఞప్తి మేరకు ప్రధాన మురుగు డ్రెయినేజీలో పూడిక, చెత్తను జెసిబి ద్వారా తొలగించి ప్రక్షాళన చేయడంతో స్థానిక యువత, మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ సర్పంచి బేబీ మహాలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి వి.రాంబాబు, ఎఎంసి డైరెక్టర్ జమ్ము మృత్యుంజయరావు, వార్డు సభ్యులు పనులను పర్యవేక్షిస్తున్నారు.

అన్నాక్యాంటీన్ వద్ద అన్నదారం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు అన్నాక్యాంటీన్ వద్ద పట్టణ టిడిపి మాజీ అధ్యక్షులు పడాల పుల్లయ్య నాయుడు 91వ పుట్టినరోజు సందర్భంగా వారి కుమారులు ప్రసాద్, రామాంజనేయులు 928వ రోజు శుక్రవారం పేదల కోసం ఉచితంగా భోజనాలు ఏర్పాటు చేశారు. వారిని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు అభినందించారు.

9న అల్లూరి జయంత్యుత్సవాల ముగింపు సభ

ప్రజాశక్తి - పాలకొల్లు

ఈ నెల తొమ్మిదో తేదీ ఆదివారం పాలకొల్లులో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 125వ జయంతి ముగింపు ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం క్షత్రియ కళ్యాణ మండపంలో ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడుక్షత్రియ పెద్దలతో కలిసి కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో క్షత్రియ పరిషత్ అధ్యక్షులు భూపతిరాజు విశ్వనాథరాజు, కార్యదర్శి డాక్టర్ కెఎస్‌పిఎఎన్.వర్మ, పొత్తూరి రామాంజనేయరాజు, కలిదిండి రామకృష్ణరాజు, గొట్టుముక్కల సూర్యనారాయణరాజు పాల్గొన్నారు


పుస్తకాలతో విద్యార్థులు

బధిర విద్యార్థులకు పుస్తకాలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

తిరుమల తిరుపతి దేవస్థానంవారు మూడు ప్రాంతాల్లో భీమవరం, తిరుపతి, వరంగల్‌లలో బధిర పాఠశాలలను నిర్వహిస్తున్నారని, వారికి దాతలు అందిస్తున్న సహకారం వెలకట్టలేనివని పాఠశాలల పర్యవేక్షకురాలు కె.లక్ష్మీనరసమ్మ (వరంగల్) అన్నారు. శ్రీవెంకటేశ్వర బధిర ఉన్నత పాఠశాలలో శ్రీవిజ్ఞానవేదిక అధ్వర్యంలో పుస్తకాలు పంపిణీ చేశారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ అరసవల్లి ఈశ్వరమ్మ వెంకట చారి ఛారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో బధిర విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలను అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ టి.తిరుపతిరావు, లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు నరహరిశెట్టి కృష్ణ, అరసవల్లి సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు పద్మనాభరాజు, గాయత్రి, హరిప్రియ, విజయ పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

నగ్న ఫొటోలు పంపిస్తామని బెదిరింపులు వ్యక్తిపై కేసు

ప్రజాశక్తి - కాళ్ల

పెదఅమిరం గ్రామానికి చెందిన యువతికి గుర్తు తెలియని నెంబర్ ద్వారా తన నగ్న ఫొటోలు పంపిస్తామని మెసేజ్‌లు వచ్చినట్లు సదరు యువతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కాళ్ల ఎస్ఐ ఎజిఎస్.మూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. పెదఅమిరం గ్రామానికి చెందిన యువతికి పేరుపాలెం గ్రామానికి చెందిన ఈశ్వరగంగా నాగకృష్ణ అశోక్ అనే వ్యక్తితో వివాహం చేసేందుకు నిర్ణయించారు. ఈశ్వర గంగా నాగకృష్ణ అశోక్ తల్లిదండ్రుల డిమాండ్ మేరకు రూ.పది లక్షల కట్నం, 30 కాసుల బంగారంతో పాటు అత్తగారికి లాంఛనాలకు రూ.మూడు లక్షలు ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నారు. మే 31న నిశ్చయ తాంబూలం జరిగింది. ఒప్పంద ప్రకారం జూన్ ఐదో తేదీన కట్నం లాంఛనాలు కాబోయే అత్త మామలకు ఇచ్చినట్లు తెలిపారు. ఈ క్రమంలో పెళ్లి రోజు తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో యువతికి ఈశ్వర గంగానాగకృష్ణ ఫోన్ చేసి నీవి న్యూడ్ ఫొటోలు వచ్చాయని, పెళ్లి చేసుకోవడం కుదరదని చెప్పాడు. పెద్దల ద్వారా పిలిపించి అడగగా యువతిని అశోక్ వివాహం చేసుకోవాలంటే తమకు ఇస్తానన్న పొలంతో పాటు, డాబా ఇంటి స్థలం కూడా వారి పేరున రాసి కట్నంగా ఇవ్వాలని అశోక్, అతని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. ఈ క్రమంలో అశోక్ వేరే గుర్తు తెలియని నెంబర్ ద్వారా యువతికి నగ్న ఫొటోలు పంపిస్తామని మెసేజ్ చేశాడని సదరు యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఏడుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

ప్రజాశక్తి - ఉండి

మండలంలోని ఉండి రాజులపేటలో పేకాట స్థావరాలపై శుక్రవారం ఎస్ఇబి, ఉండి పోలీస్ సిబ్బంది సంయుక్తంగా దాడి చేశారు. ఈ దాడిలో ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఉండి ఎస్ఐ కె.గంగాధరరావు తెలిపిన వివరాల ప్రకారం.. రాజులపేటలోని ఒక ఇంటిలో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు ఎస్ఇబి, ఉండి పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.53,530 నగదు, మూడు సెల్‌ఫోన్లు, 112 కాయిన్స్ స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మండలంలో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించిన, జూద క్రీడలు ప్రోత్సహించినవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రేషన్ పంపిణీలో తగ్గిన సరుకులు

పెరుగుతున్న కూరగాయల, నిత్యావసరాల ధరలు
పేదలు, సామాన్యుల అవస్థలు

ప్రజాశక్తి - పాలకొల్లు

ఒకపక్క నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకు మండిపోతుంటే రాష్ట్ర ప్రభుత్వం రేషన్ షాపుల్లో ఒక్కొక్క సరుకును తగ్గిస్తోంది. పైగా ఎక్కువ ధర ఉండే కందిపప్పు ఇవ్వకుండా తక్కువ ధర ఉండే గోధుమ పిండి కొత్తగా ఇస్తున్నట్లు చెబుతోంది. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రూ.180లకు ఎనిమిది నిత్యావసర వస్తువులు అందించగా, టిడిపి హయాంలో కొన్నింటికే పరిమితం చేశారు . వైసిపి హయాంలో స్వర్ణరకం మధ్యస్థ సన్న బియ్యం అని చెప్పి నాణ్యమైన బియ్యం అంటూ ఇస్తోంది. గత నాలుగు నెలలుగా కొత్త బియ్యం ఇవ్వడంతో కడుపునొప్పితో ఇబ్బందులు పడుతున్నామని వృద్ధులు, రోగులు, చిన్నారులు వాపోతున్నారు. మార్కెట్‌లో అన్ని నిత్యావసర వస్తువులు, పప్పుల ధరలు పెరగడంతో మే,


రేషన్ ద్వారా అందించే కందిపప్పు

జూన్ నెలల్లో రూ.68కి ఇచ్చే కందిపప్పు కేవలం 25 శాతం కార్డు దారులకు మాత్రమే అందించారు. గత నెల రోజులుగా కాయగూరల ధరలు పెరిగిపోవడంతో సామాన్యులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రేషన్‌లో కందిపప్పు కూడా అందించాలని ప్రజలు కోరుతున్నారు.

రేషన్ ద్వారా కందిపప్పు ఇవ్వాలి
ఎం.మీనాలక్ష్మికుమారి, గృహిణి, పాలకొల్లు



గత రెండు నెలలుగా కాయగూరలు, నిత్యావసర వస్తువుల ధరలు దారుణంగా పెరిగాయి. మూడు నెలలుగా కందిపప్పు ఇవ్వడం లేదు. బహిరంగ మార్కెట్ లో రూ.120 నుంచి 140 ధర ఉంది. ఈ నెల నుంచి రేషన్ ద్వారా కందిపప్పు ఇవ్వాలి.

సామాన్యులు, పేదలు కాయగూరలు తినే పరిస్థితి లేదు
బాసిన శ్యామల, మహిళా సంఘం నేత, పాలకొల్లు



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యావసర వస్తువుల ధరలకు కళ్లెం వేయకపోవడంతో పప్పులు, నూనెలు, ఇతర నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోతున్నాయి. ఈ నేపథ్యంలో రేషన్ షాపుల ద్వారా గతంలో వలే అన్ని సరకులు ప్రభుత్వం ఇవ్వాలి.

సిపిఎస్ రద్దు కోరుతూ నేడు ధర్నా

ప్రజాశక్తి - తణుకు రూరల్

సిపిఎస్ ఉద్యమానికి ఫ్యాప్టో మద్దతు ఇస్తుందని ఎపిటిఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి ఐ.రాజగోపాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎపి సిపిఎస్ ఇఎ ఈ నెల ఎనిమిదో తేదీన ఉమ్మడి జిల్లాల ముందు పాత పెన్షన్ సాధన (ఒపిఎస్) కోసం ధర్నా కార్యక్రమాన్ని ప్రకటించిందని తెలిపారు. పాత పెన్షన్ కోసం ఫ్యాప్టో ఆరు అంచెల ఉద్యమ కార్యక్రమాన్ని ప్రకటించిందని తెలిపారు. జిపిఎస్‌ను ప్రతిఘటిస్తూ పాత పెన్షన్ తప్ప మరే ప్రత్యామ్నాయం మాకు ఆమోదయోగ్యం కాదని ఫ్యాప్టో, ఎపి సిపిఎస్ ఇఎ భావిస్తున్నట్లు చెప్పారు. ఎపి సిపిఎస్ ఇఎ రాష్ట్ర సంఘం ఈ నెల ఎనిమిదో తేదీన ప్రకటించిన ధర్నా కార్యక్రమానికి ఫ్యాప్టో కూడా తమ సంపూర్ణ మద్దతు ప్రకటించిందని, ఈ ధర్నాలో ఫ్యాప్టో సంఘాలు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

చలో కలెక్టరేట్ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - ఆచంట

అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యల పరిష్కారానికి ఈ నెల 10, 11 తేదీల్లో నిర్వహించనున్న 36 గంటల చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు వైట్ల ఉషారాణి, వద్దిపర్తి అంజిబాబు పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో శుక్రవారం చలో కలెక్టరేట్ సన్నాహక సభ నిర్వహించారు. ఈ సమావేశానికి అంగన్‌వాడీ మండల కమిటీ సభ్యులు గుత్తుల శ్రీదేవి అధ్యక్షత వహించారు. ఉషారాణి, అంజిబాబు మాట్లాడుతూ అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్ కింద రూ.ఐదు లక్షలు ఇవ్వాలని, అంగన్‌వాడీ హెల్పర్లకు వయో పరిమితిని 50 సంవత్సరాలకు పెంచాలని, 300 జనాభా దాటిన అంగన్‌వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవ్ ఇవ్వాలని, మెనూ ఛార్జీలు పెంచాలని, గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని, సీనియార్టీ ప్రకారం వేతనాలు ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ ఇవ్వాలనే పలు డిమాండ్లతో భీమవరం కలెక్టరేట్ వద్ద 36 గంటల మహాధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ సెంటర్లు రెండుంజులు నిలుపుదల చేసి అంగన్‌వాడీ హెల్పర్లు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని ఈ మహాధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ నాయకులు నెక్కంటి కనకదుర్గ, ఎ.ఆశాజ్యోతి, వి..జాన్సి, కె.వరలక్ష్మి, వి.అచ్యుతవల్లి, ఎం.సత్యకుమారి, ప్రజాసంఘాల నాయకులు సిర్రా నర్సింహమూర్తి పాల్గొన్నారు.

బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు

ప్రజాశక్తి - పాలకొల్లు

పట్టణంలోని జివిఎస్‌విఆర్ఎం మున్సిపల్ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న బాలికలకు అర్బన్ పరిధిలోని ప్రైమరీ హెల్త్ సెంటర్ ఎఎన్ఎం రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సరైన పోషకాహారం తీసికోవటం వల్ల రక్తహీనతను నుంచి కాపాడుకోవచ్చని చెప్పారు. రక్తహీనతతో కలిగిన పిల్లలు తొందరగా అలసిపోతారని, నీరసించిపోతారని తెలిపారు. ప్రతి గురువారం విద్యార్థులకు ఐరన్, పోలిక్ టాబ్లెట్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశావర్కర్లు జానకి, సునిత, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాయపూడి భవానీప్రసాద్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పాఠశాలలో ఘనంగా చాక్లెట్ డే

ప్రజాశక్తి - భీమవరం రూరల్

చాక్లెట్ అంటే ఇష్టపడని పిల్లలెవరూ ఉండరని లూథరన్ హైస్కూల్ ప్రదానోపాధ్యాయులు మణిరాజ్ అన్నారు. ప్రపంచ చాక్లెట్ దినోత్సవాన్ని శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో భీమవరం లూథరన్ హైస్కూలులో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మణిరాజ్ మాట్లాడుతూ నేడు చాక్లెట్స్ వ్యాపారంతో ఎంతోమంది జీవనోపాధి పొందుతున్నారన్నారు. చిన్నపిల్లలు అమితంగా చాక్లెట్స్‌ను ఇష్టపడతారన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ 1550 ఐరోపాలో మొదటిసారిగా చాక్లెట్ తయారైందని ఆధారాలు లభించాయని, దానికి గుర్తింపుగా తొలిసారిగా 2009 ప్రపంచ చాక్లెట్ దినోత్సవాన్ని నిర్వహించారని తెలిపారు. అనంతరం హైస్కూల్ నుంచి ప్రకాశం చౌక్ సెంటర్ వరకు చాక్లెట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నరహరిశెట్టి కృష్ణ, ఉండపల్లి రమేష్‌నాయుడు, భట్టిప్రోలు శ్రీనివాస్, కొండ్రు శ్రీనివాస్, కె.శిరీష, నీలాతి పోతయ్య పాల్గొన్నారు.

డిగ్రీలో చేరేందుకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు డిఎన్ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో డిగ్రీలో చేరేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ శోభారాణి తెలిపారు. బిఎలో అర్థశాస్త్రం, రాజనీతి శాస్త్రం, హిస్టరీ, బి.కామ్ జనరల్, కంప్యూటర్ అప్లికేషన్స్, బిఎస్‌సి మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కంప్యూటర్స్ కెమిస్ట్రీ, బొటని, జువాలజి కోర్సుల్లో ప్రవేశానికి ఇంటర్ పాసైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ఈ నెల 12న చివరి తేదీ అని తెలిపారు. మరిన్ని వివరాలకు 6302194657 సంప్రదించాలని తెలిపారు.

అతిథి గృహం నిర్మించారు.. విద్యుత్ మరిచారు


ప్రజాశక్తి - పాలకొల్లు

ఎట్టకేలకు పూర్తయిన మున్సిపల్ అతిథి గృహాన్ని గత నెల 28వ తేదీన రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ప్రారంభించారు. దీని నిర్మాణం దాదాపు 80 శాతం టిడిపి హయాంలోనే పూర్తయింది. ఇటీవల మిగిలిన పనులు పూర్తి చేసి ప్రారంభించారు. దీని నిర్మాణానికి రూ.62 లక్షలు ఖర్చయింది. అయితే ఇప్పటివరకు విద్యుత్‌కు మున్సిపాలిటీ దరఖాస్తు చేయకపోవడంతో అన్ని హంగులు ఉన్నా వినియోగంలోకి రాలేదు. దీంతో దీని అద్దె సైతం నిర్ణయించలేదు. పట్టణంలో సరైన అతిథి గృహం లేకపోవడంతో మంత్రులు, ఉన్నతాధికారులు దిండి, పాలవెల్లి వంటి అతిథి గృహాలకు తరలిపోతున్నారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ అధికారులు వెంటనే విద్యుత్ ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.


పాలకొల్లులో మున్సిపల్ అతిథి గృహం

జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు

ఎంఎల్ఎ శ్రీరంగనాథరాజు


రైతులతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ శ్రీరంగనాథరాజు


ప్రజాశక్తి - పెనుగొండ

జగనన్న కాలనీలో మౌలిక వసతులు కల్పిస్తామని ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. సిద్ధాంతం, దొంగరావుపాలెం గ్రామాలకు సంబంధించి 5.40 ఎకరాల్లో సుమారు 200 మంది లబ్ధిదారులకు ఇళ్లపట్టాలు ఇచ్చారు. ఇల్లు నిర్మించుకోవడానికి ఎటువంటి మౌలిక సదుపాయాలు లేకపోవడంతో అక్కడ ఎవరూ ఇల్లు నిర్మాణం చేపట్టలేకపోయారు. రహదారి నిర్మాణానికి కొంతమంది రైతులు అడ్డు చెప్పడంతో ఇప్పటివరకు పనులు చేపట్టలేదు. ఎంఎల్ఎ శ్రీరంగనాథరాజు రహదారికి అవసరమైన భూములున్న 26 మంది రైతులతో శుక్రవారం సిద్ధాంతం సొసైటీలో సమావేశం ఏర్పాటు చేసి వారిని ఒప్పించారు. భూములు ఇచ్చే రైతులు 26 మందికి రూ.9,86,250 ప్రభుత్వం నష్టపరిహారం ఇస్తుందని, ఈ పరిహారం వచ్చే లోపు తాను వ్యక్తిగతంగా ముందే రైతులందరికీ ఇస్తాననే హామీతో రైతులందరూ ఒప్పుకున్నారు. ఆయనతో పాటు వెంట గ్రామ సర్పంచి చింతపల్లి గనరాజు (చంటి), ఎంపిటిసి సభ్యులు చిన్నం ఏడుకొండలు, బలువు కేదారి పాల్గొన్నారు.

నెలమూరులో కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - పెనుమంట్ర

వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నెలమూరులో గొట్టుముక్కల భాస్కర వర్మ ఇంటి దగ్గర ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణా కేంద్రాన్ని శుక్రవారం గ్రామ సర్పంచి కుచ్చర్లపాటి మంగతాయారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు నాగరాజు లక్ష్మి పాల్గొన్నారు. ఎంతో ఉత్సాహంగా ఆ గ్రామంలో సుమారు 60 మంది మహిళలు కుట్టు శిక్షణ పొందుతున్నారు. భాస్కరవర్మ మాట్లాడుతూ తాను అడిగిన వెంటనే గ్రామానికి కుట్టు శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేసినందుకు వసుధ ఫౌండేషన్ ఛైర్మన్ వెంకటరామరాజుకు ధన్యవాదాలు తెలిపారు. సర్పంచి మంగతాయారు మాట్లాడుతూ మహిళా సాధికారత కోసం ఈ కుట్టు శిక్షణా కేంద్రం గ్రామంలోని మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ అవకాశం కల్పించిన వసుధ ఫౌండేషన్ వారికి గ్రామం తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఎంపిటిసి సభ్యులు లక్ష్మి మాట్లాడుతూ గ్రామంలోని మహిళలు కుట్టు శిక్షణ నేర్చుకోవాలంటే సుమారు 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న పట్టణాలకు వెళ్లాల్సిన పరిస్థితి లేకుండా గ్రామంలోనే శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.


కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచి మంగతాయారు

'ఫ్యామిలీ డాక్టర్'ను వినియోగించుకోండి

ప్రజాశక్తి - మొగల్తూరు

ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ దినేష్ సూచించారు. మండలంలోని శేరేపాలెం, కొత్తోట గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పలువురిని పరీక్షించారు. కొత్తపాలెంలోని ఆరోగ్య కేంద్రంలో సుమారు 60 మంది రోగులను పరీక్షించి అవసరమైన వారికి మందులు అందించారు. అనంతరం అదే గ్రామంలో లేవలేని స్థితిలో ఉన్న రోగులను పరీక్షించి తగు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో శ్యామల, నాగసుధ పాల్గొన్నారు. కొత్తోట సచివాలయంలో డాక్టర్ చంద్ర శేఖర్ సుమారు 70 మంది రోగులను పరీక్షించి మందులు అందించారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ, సత్యవతి, పద్మావతి, విజయలక్ష్మి పాల్గొన్నారు.


రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

'ఉపాధి'లో అవకతవకలపై ఫిర్యాదు

ప్రజాశక్తి - ఉండి

తమ గ్రామంలో చేసిన ఉపాధి హామీ చట్టంలో అవకతవకలు జరిగాయనిడ్వామా పీడీ ఎం.రాజేశ్వరరావుకు మండలంలోని వెలివర్రు గ్రామస్తులు, గ్రామ మాజీ ఉపసర్పంచి ముదునూరి కొండరాజు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ముదునూరి కొండరాజు మాట్లాడుతూ వెలువర్రు గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ పెచ్చేటి శ్రీను ఉపాధి హామీ పనులకు రాని వారి పేర్లను నమోదు చేసి మస్తర్లు వేసి అవకతవకలకు పాల్పడుతున్నాడని చెప్పారు. అనంతరం ఎం.రాజేశ్వరరావు మాట్లాడుతూ దీనిపై పునర్విచారణ చేయిస్తామని, అవకతవకలు నిజమైతే చర్యలు తప్పవని చెప్పారు. గతేడాది ఉండిలో జరిగిన అవకతవకలు గుర్తించకుండా జిల్లా రిసోర్స్ పర్సన్‌లు తప్పుడు నివేదిక ఇచ్చారని వైసిపి నాయకులు కొందరు ఫిర్యాదు చేయగా అప్పట్లో కూడా ఇదే మాదిరిగా పునర్విచారణ చేయిస్తామని చెప్పారని, ఇప్పటివరకు వారిపై ఎటువంటి చర్యలు తీసుకున్నారో ఎవరికీ తెలియని పరిస్థితి ఏర్పడిందని, ఇప్పుడు కూడా అదే జరుగుతుందని పలువురు గుసగుసలాడుకున్నారు.

డెంగీపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - గణపవరం

మండలంలోని కాశిపాడులో శుక్రవారం డెంగీ నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచి కోట నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ నెల 31వ తేదీ వరకు పిప్పర ప్రాథమిక ఆసుపత్రి ఆధ్వర్యంలో డెంగీ నివారణ మాసోత్సవాల సందర్భంగా ర్యాలీలు నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. ఇళ్ల వద్ద మురికినీరు నిల్వ ఉండడం వల్ల దోమలు పెరుగుతాయన్నారు. దోమలు కుట్టడం వల్ల డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా వంటి రోగాలు వస్తాయన్నారు. దోమలు ఇళ్లలోకి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సహాయకులు నామాల రాజు, ఎంపిటిసి సభ్యులు జంపన పద్మావతి రమేషరాజు, కార్యదర్శి ఆర్‌డి రామారావు పాల్గొన్నారు.


డెంగీపై అవగాహన ర్యాలీ


సాయం అందిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

పేద విద్యార్థినికి లయన్స్ క్లబ్ ఆర్థిక సాయం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం లయన్స్ క్లబ్ రీజియన్ చైర్‌పర్సన్ మదన్మోహన్ అగర్వాల్ భార్య అనిత అగర్వాల్ పుట్టినరోజు సందర్భంగా దుర్గ అనే పేద మెరిట్ విద్యార్థినికి రూ.ఐదు వేల ఆర్థిక సాయం ముఖ్య అతిథి జోన్ చైర్‌పర్సన్ లయన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు చేతులమీదుగా అందించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ తాడేపల్లిగూడెం లయన్స్ క్లబ్ చేసే సేవా కార్యక్రమాలు అందరికి స్ఫూర్తిదాయకమని, విద్యార్థినులు చదువుకునేందుకు పేదరికం అడ్డు కాకూడదని మెరిట్ గల పేద విద్యార్థినికి రూ.ఐదు వేలు ఆర్థిక సహాయం చేయడం చాలా ఆనందదాయకమని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలతో తాడేపల్లిగూడెం లయన్స్ క్లబ్ అభివృద్ధి పథంలో పయనించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రీజియన్ చైర్‌పర్సన్ మదన్మోహన్ అగర్వాల్, రీజియన్ సెక్రటరీ సన్నిధి సూర్యనారాయణమూర్తి, క్లబ్ అధ్యక్షులు వంగపండు రామమోహన్‌రావు, సెక్రటరీ చెన్నం జగదీష్ పాల్గొన్నారు.

నేడు వైఎస్.రాజశేఖర్‌రెడ్డి జయంతి

ప్రజాశక్తి - పాలకొల్లు

ఈ నెల ఎనిమిదో తేదీ శనివారం వైఎస్.రాజశేఖర్‌రెడ్డి జయంతి సందర్భంగా గాంధీ బొమ్మల సెంటర్‌లో రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్ పూలమాలలు వేసి నివాళి అర్పిస్తారు. అనంతరం పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఉదయం 9:30 గంటలకు పాలకొల్లు మండలం గవరపేట పంచాయతీ కార్యాలయం వద్ద ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించే జగనన్న సురక్ష కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఉదయం 10:30 గంటలకు పాలకొల్లు మండలం దిగమర్రు పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించే జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొంటారు.

PUBLIC NOTICE

This Public Notice is givien on the instructions of my client **RANDHI VIJAYA KUMAR, S/o Suryanarayana** of Kaikaram Village, Unguturu Mandal, Eluru District, A.P.

That my client has acquired the below mentioned schedule property under a **Regd. dated 23-07-2015 Sale Deed Document No. 3425/2015** exeuted by (late) Chenchayya Gupta, S/o (late) China Subbayya is sons and daughter (1) Kota Lakshminarayana, S/o. (late) Chenchayya Gupta, (2) Kota Humuman Babu, S/o (late) Chenchayya Gupta, (3) Pasala Jyothi Sridevi, W/o Gopala Krishna, schedule property holder (late) Kota China Subbayya, he died Dt. 08-12-1965 after the death of Kota China Subbayya is family members (late) Kota Chenchayya Gupta his wife (late) Kota Lakshmikantam. His familymembers executed the sale of porperty to my client without death certificate and family member certificate. Therefore, the public notice is issued to all that anybody belongs to Kota China Subbayya family has any cliams over schedule property. May shall come forward with documentary proof with in 7 days. For the date of this notice to the underised, else if shall be deemed that there are no claims or objections over the schedule property and the transaction willbe proceeded with.

DOCUMENT SCHEDULE

West Godavari District, Bhimadolu District Registry, Unguturu Mandal, Kaikaram Village in R.S.No. 456/107 of site 202 Sq.yards of following boundaries. ***East:*** Panchayat Chervu Gattu. ***West:*** Raja Veedhi. ***South:*** Site of Pasagada Venkata rao. ***North:*** Site of Gurram Lakshmi.

PAMMI V. NAGA VEERABHADRUDU
Advocate, Tapdepalligudem W.GDt.,
Cell No. 77023 11197

పబ్లిక్ నోటీసు

నా క్లయింటు **రంధి విజయకుమార్, తండ్రి: సూర్యనారాయణ,** సంత మార్కెట్ వీధి, డోరు నెం.8-5/2, కైకరం గ్రామం, ఉంగుటూరు మండలం, ఏలూరు జిల్లా, ఎ.పి.

నా క్లయింటుకు సంబందించి పబ్లిక్ నోటీసు జారీ చేయబడినది. నా క్లయింటు రంధి విజయకుమార్ గారు యీ క్రింది షెడ్యూలు క్రయ దస్తావేజు 1) తోట లక్ష్మీనారాయణ, తండ్రి: (లేటు) చెంచయ్య గుప్త, 2) కోట హనుమాన్ బాబు, తండ్రి: (లేటు) చెంచయ్య గుప్త, 3) పసల జ్యోతి శ్రీదేవి, భర్త: గోపాలకృష్ణ గార్ల ద్వారా **ది.23-07-2015 సం॥రం తేదీన భీమడోలు సబ్ రిజిస్ట్రారు వారి వద్ద క్రయం పొందిన డాక్యుమెంటు నెం.3425/2015,** (లేటు) కోట చెంచయ్య గుప్త, తండ్రి: (లేటు) చిన సుబ్బయ్య మరియు కోట చెంచయ్యగుప్త గారి భార్య కోట లక్ష్మీకాంతం గారు వీరి ముగ్గురి మరణానంతరం (వీరి మరణ ధృవీకరణపత్రము, కుటుంబ సభ్యులు ధృవపత్రము జత పర్చకుండా) వీరి వారునులైన పై 1, 2, 3 అను వారి ద్వారా ఈ షెడ్యూలు ప్రాపర్టీని క్రయం పొందినారు. కావున పైన తెలిపిన ప్రాపర్టీకి వీరు ముగ్గురూ కాకుండా ఇంకా ఎవరైనా వారసులు ఉంటే గనుక లేక ఎవరికైనా అభ్యంతరములు ఉన్ననూ ఈ ప్రకటన ఇచ్చిన 7 రోజులలోవు ఈ అడన్సుకు తెలియజేయగలరు.

షెడ్యూలు

పశ్చిమ గోదావరి జిల్లా, భీమడోలు సబ్ రిజిస్ట్రారు, ఉంగుటూరు మండలం, కైకరం గ్రామం సర్వే నెం. 456/107, చ॥గ॥ 202 లు గల నివేశ స్థలములో గల పెంకుటిల్లుకు హద్దులు. ***తూర్పు:*** పంచాయితీ చెరువు గట్టు. ***పడమర:*** రాజవీధి. ***దక్షిణం:*** వనగాడ వెంకట్రావు గారి స్థలం. ***ఉత్తరం:*** గుర్రం లక్ష్మి గారి స్థలం.

పమ్మి వి. నాగ వీరభద్రుడు
అడ్వకేట్, తాడేపల్లిగూడెం, ప॥గో॥జిల్లా.
సెల్: 77023 11197